PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

శుక్రవారం 17-04-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 222 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

## ఆప్ రాజ్యసభ సభ్యుడు అశోక్ మిత్తల్ ఇంటిపై ఈడీ దాడులు



ఆప్ రాజ్యసభ సభ్యుడు అశోక్ కుమార్ మిత్తల్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి మిత్తల్ నివాసం సహా.. ఆయనకు సంబంధించిన పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాల (జుణ ఝఱఎం)పై వివరణాత్మక ప్రకటనను త్వరలో వెల్లడిస్తామన్నారు. వ్యాపారవేత్త, విద్యావేత్త అయిన అశోక్ కుమార్ మిత్తల్ లవ్లీ గ్రూప్‌నకు అధిపతిగా ఉన్నారు. ఈ గ్రూప్ ఒక యూనివర్సిటీని నడుపుతోంది.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి తమ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా భయపడుతున్నారనే కారణంతో.. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ఆయనను రాజ్యసభలో తమ పార్టీ ఉపనేత స్థానం నుంచి తొలగించింది. ఆ హోదాలో పంజాబ్ ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఈ నియామకం జరిగిన కొద్ది రోజుల్లోనే ఆయన నివాసంలో ఈడీ దాడులు చేపట్టడం గమనార్హం. పేజి 2లో ▶

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

- నీటి పొదుపు: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడటం.
- పరిశుభ్రత: బహిరంగ ప్రదేశాల్లో శుభ్రతను పాటించడం.
- పర్యావరణం: 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటడం.
- స్వదేశీ నినాదం: 'వోకల్ ఫర్ లోకల్' ద్వారా స్థానిక వస్తువులనే ప్రోత్సహించడం.
- పర్యాటకం: దేశీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేయడం.



ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు.

"మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం. పేజి 2లో ▶

## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

**శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం**

**ట్రంప్ మరోమారు కీలక**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. పేజి 2లో ▶

# సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్‌పై చర్చించారు. సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మార్పు, జగిత్యాల నియోజకవర్గంలో పరిణామాలపై కూడా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రులపై, ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఈ భేటీలో చర్చించారు. సీఎం నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది.





## తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్


- కీలక బాధ్యత: పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్ నియామకం.
- రాష్ట్ర నాయకత్వం: ఏపీ తెదేపా అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు కొనసాగింపు.



మిగతాది 2లో







## వడగాలులు, ఎండలతో జాగ్రత్త

- పిడుగులతో కూడిన వర్షాల సమయంలో ఇంటివద్దనే ఉండాలి..
- తుఫాన్లు వరదల సమయంలో అంటువ్యాధులతో జాగ్రత్త
- ఇంటి పరిసరాలు అనేవి ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి..
- ప్రకృతి విపత్తుల నుండి కాపాడుకోవడానికి సూచనలు తప్పక పాటించాలి..
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్

ఎండ తీవ్రతకు, వడగాల్పులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణహాని నుండి కాపాడుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని ఆయన చెప్పారు. వడగాల్పుల నుండి రక్షణ కొరకు టోపీ, రుమాలు, తెలుపు రంగు కాటన్ వస్త్రాలను వినియోగించాలన్నారు. కళ్ల రక్షణ నిమిత్తం నాణ్యమైన సన్ గ్లాసెస్ వినియోగించాలన్నారు. ఇంటివాతావరణం చల్లదనం కోసం ఇంటి పై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ వంటి అంశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేడపై మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ భవనాలను చల్లగా ఉంచుతాయని చెప్పారు. మొక్కలు ఉష్ణ తాపాన్ని తగ్గిస్తాయని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచడం ద్వారా వేడి గాలుల నుండి ఉపశమనం లభించి చల్లని వాతావరణం అలముకుంటుందని చెప్పారు. వర్షం పడిన సమయంలో పిడుగుపాటుకు గురి కాకుండా తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో ఇంటిలోనే ఉండాలని ఆయన సూచించారు. ఉరుముల సమయంలో సముద్రము, కొలనులు, చెరువుల దగ్గర ఉంటే వెంటనే దూరంగా వెళ్లాలన్నారు. రేకు లోహము కలిగిన నిర్మాణాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పనిచేసే రైతులు, పేజి 2లో ▶

## కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనులపై మంత్రి బీసీ జనార్దన్ సమీక్ష



- నెల్లూరు జిల్లాలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు.
- ఈ సందర్భంగా 'అదానీ కృష్ణపట్నం' పోర్టును పరిశీలించారు.

2లో..

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో తెరపైకి కొత్త పేరు



2లో..

- మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

## పంజాగుట్ట వద్ద కారులో చెలరేగిన మంటలు



2లో..

## మూడేళ్ల క్రితమే అభిప్రాయం చెప్పాం..

**అందులో మార్పు లేదు: కేటీఆర్**



హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరిగితే సహించేది లేదని.. బలమైన ప్రజా ఉద్యమం వస్తుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పునర్విభజన ప్రక్రియపై ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన పోస్టును ట్యాగ్ చేశారు. మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ అభిప్రాయం చెప్పామని.. అందులో మార్పు లేదని స్పష్టం చేశారు. పేజి 2లో ▶

## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

- మొదటి సంవత్సరంలో 77 శాతం
- రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా



ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. పేజి 2లో ▶

# సంపాదకీయం

## నయా ఉదారవాదం తాకిడికి బీటలు వారిన జాతీయోద్యమ స్ఫూర్తి

ఇరాన్ మీద అమెరికా-ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం విషయంలో భారత ప్రభుత్వం ఇంత నీచమైన స్థాయిలో పిరికిపంద లాగా వ్యవహరించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మధ్య బ్రిటన్ యాభై దేశాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసింది. దానికి భారతదేశం కూడా హాజరైంది. ఆ సమావేశంలో హోర్ముజ్ జలసంధిని మూసివేసినందుకు ఇరాన్‌ను చాలా తీవ్రంగా విమర్శించారే తప్ప ఇరాన్ మీద అమెరికా-ఇజ్రాయిల్ జరుపుతున్న దాడి గురించి పల్లెత్తు మాట కూడా అనలేదు. ఐ.రా.స సర్వసభ్య సమావేశం గల్ఫ్ లోని ఇతర దేశాల మీద ఇరాన్ జరుపుతున్న దాడులను ఖండిస్తూ ఒక తీర్మానం చేసింది. దాని ప్రతిపాదకులలో భారత్ కూడా ఒకటి (వాస్తవానికి ఇరాన్ గల్ఫ్‌లో ఏర్పాటైన అమెరికన్ సైనిక స్థావరాల మీదనే దాడి ఎక్కుపెట్టింది.). ఆ సందర్భంలో కూడా ఎక్కడా అమెరికా-ఇజ్రాయిల్ కూటమిని విమర్శించలేదు. ఇరాన్ అగ్రనేత అయతుల్లా అలీ ఖమేనీ హత్య పట్ల, మినాబ్‌లో 175 మంది అమాయకులైన స్కూలు పిల్లలను దారుణంగా బాంబు దాడిలో చంపడం పట్ల సంతాపాన్ని ప్రకటించడానికి కూడా భారత్‌కు చాలా వారాలు పట్టింది.అయితే ఇటువంటి పిరికితనం ప్రదర్శిస్తున్నది కేవలం భారత్ మాత్రమే కాదు. ద్వంద్వ ప్రమాణాలతో కూడిన ఐ.రా.స తీర్మానాన్ని బలపరిచిన దేశాలు 135 ఉన్నాయి. ఆ విధంగా చేయకపోతే ఎక్కడ అమెరికాకు ఆగ్రహం కలుగుతుందోనని భయపడుతున్నాయి. నిజానికి కొద్దిపాటి వేళ్ళ మీద లెక్కపెట్టగల దేశాలు మాత్రమే అమెరికా-ఇజ్రాయిల్ కూటమి ఇరాన్‌పై చట్టవిరుద్ధంగా, అనైతికంగా సాగిస్తున్న యుద్ధాన్ని నిర్ద్వంద్వంగా ఖండించగల దమ్ము చూపగలిగాయి. ఈ పరిస్థితి తీవ్రంగా ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలో వలస విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సాగిన పోరాటాలు ఆ యా దేశాల, జాతుల సార్వభౌమాధికారాన్ని అందరూ గౌరవించి, గుర్తించాలన్న మూల సూత్రం మీద ఆధారపడి నడిచాయి. వలస పాలనా కాలం అంతమైన తర్వాత ఇంతవరకూ ఆ సూత్రాన్ని గౌరవిస్తున్నారు. కాని ఇప్పుడు ఐ.రా.స తీర్మానం ఆ మూల సూత్రాన్ని, వలస పాలన రద్దు వెనుక ఉన్న ప్రాతిపదికను ధ్వంసం చేస్తోంది.ఈ మూడవ ప్రపంచ దేశాలన్నీ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని సాధించడం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దీర్ఘకాలం అనేక కష్టాలకోర్చి పోరాడిన చరిత్ర కలిగివున్నాయి. ఇప్పుడు ఆ సార్వభౌమాధికారాన్నే సాటి మూడవ ప్రపంచ దేశం విషయంలో తన సైనిక బలంతో అమెరికన్ సామ్రాజ్యవాదం తృణీకరిస్తున్నప్పుడు ఈ దేశాలన్నీ ఇంత పిరికితనంతో వ్యవహరించడం ఒక చిక్కు ప్రశ్నగా ఉంది.

ఈ ప్రశ్నకు సమాధానం తెలియాలంటే ముందు మన ప్రపంచంలో నయా ఉదారవాదం చేసిన రెండు బీటలను లేదా పగుళ్లను మనం గుర్తించాలి. మొదటిది: సామ్రాజ్యవాద వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల క్రమంలో "జాతి" అనే భావన రూపొందింది. ఈ భావన పశ్చిమ యూరప్ దేశాలలోని "జాతి" భావన కన్నా మౌలికంగా విభిన్నమైనది. మొదటి తేడా: పశ్చిమ యూరప్ 'జాతి' భావన ఒకానొక అంతర్గత శత్రువును లక్ష్యంగా చేసుకుని ఆ శత్రువుకు వ్యతిరేకంగా తక్కిన ప్రజానీకాన్ని ఐక్యం కావాలని కోరుతుంది. కాని వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముందుకొచ్చిన "జాతి' భావనలో అటువంటి అంతర్గత శత్రువు ఎవరూ ఉండరు. ఈ భావన అందరినీ కలుపుకుని పోయే భావన. ఇక రెండవ తేడా: పశ్చిమ యూరప్ "జాతి" భావనలో విస్తరణ కాంక్ష కలగలిసి వుంది. అదే వలసాధిపత్య వ్యతిరేక పోరాటంలో ముందుకొచ్చిన "జాతి" భావన ఎటువంటి విస్తరణ కాంక్షనైనా వ్యతిరేకిస్తుంది. మూడవ తేడా: పశ్చిమ యూరప్ 'జాతి' భావన దేశాన్ని ప్రజలకు అతీతమైన ఒక దేవతామూర్తిగా చిత్రించి ప్రజలందరూ దానికి విధేయులుగా వ్యవహరించాలని బోధిస్తుంది. అదే వలసాధిపత్యానికి వ్యతిరేకంగా తలెత్తిన "జాతి" భావన దేశం అంటేనే ప్రజలు అని స్పష్టంగా ప్రకటిస్తుంది.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం అనేది ఒక బహుళ వర్గ పోరాటం. అందులోకి భిన్న వర్గాల ప్రజలను కలుపుకురావాలి. ఆ క్రమంలోనే ఇక్కడ "జాతి" భావన అనేది యూరోపియన్ భావనకు భిన్నంగా ఆవిర్భవించింది. స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచే విధానం అమలు లోకి వచ్చింది. ఆ విధానం పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమాన్ని ప్రోత్సహించినప్పటికీ, పెట్టుబడిదారీవర్గం 'దేశాభివృద్ధి' పేరుతో అడ్డగోలుగా వ్యవహరించడానికి వీలు లేకుండా ఆంక్షలు విధించింది. ప్రభుత్వానికి బహుళ వర్గాల మద్దతు అవసరం కనుక దానిని నిలబెట్టుకోడానికి అలా చేసింది. ఇందుకు పెట్టుబడిదారులు కూడా పెద్దగా అభ్యంతరం ఏమీ చెప్పలేదు. సామ్రాజ్యవాద నియంత్రణ నుండి బైటపడి తాము వేగంగా అభివృద్ధి చెందాలంటే రాజ్యం స్వయం నిర్ణాయక శక్తితో వ్యవహరించాల్సి వుంటుందని, సామ్రాజ్యవాదం ముందు లొంగుబాటును ప్రదర్శించకూడదని వారూ అంగీకరించారు. ఈ నేపథ్యంలోనే రూపొందిన అభివృద్ధి క్రమం దేశంలో ప్రభుత్వ రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందడానికి దారి తీసింది. మూడవ ప్రపంచ దేశాలలో ఎక్కువ భాగం అలీన విధానాన్ని అనుసరించడం ఈ క్రమానికి తోడైంది. ఇటువంటి వ్యవస్థలో మధ్యస్థ వర్గాలు నిర్ణయాత్మకంగా వ్యవహరించగలిగాయి. ప్రభుత్వ రంగం, అలీన విధానం-ఈ రెండూ స్వాతంత్ర్యానంతర కాలంలో రెండు ముఖ్యమైన లక్షణాలు.

పెట్టుబడి ప్రపంచీకరణ ఎప్పుడైతే వేగం పుంజుకుందో అప్పటి నుంచీ పరిస్థితులు మారిపోయాయి. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ వర్గం అంతర్జాతీయ పెట్టుబడితో మమేకం అయ్యింది. అంతవరకూ అనుసరిస్తూ వచ్చిన అభివృద్ధి క్రమానికి నీళ్ళొదిలింది. సమాజంలోని వృత్తి నిపుణులు, బ్యూరోక్రాట్లు తమ బిడ్డలు సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో స్థిరపడాలని బలంగా కోరుకున్నారు. అందుచేత వారంతా నయా ఉదారవాద వ్యవస్థకు గట్టి మద్దతుదారులుగా నిలిచారు. భూస్వామ్య వర్గాలు సైతం నయా ఉదారవాద వ్యవస్థలోనే తమ భవిష్యత్తును నిర్మించుకోడానికి సిద్ధపడ్డాయి. ఈ తరగతులన్నీ కలిసి కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, చిన్న ఉత్పత్తిదారులకు, చిన్న జీతగాళ్ళకు వ్యతిరేకంగా బలంగా నిలిచాయి. ఆ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో భాగంగా రూపొందిన బహుళ వర్గ ఐక్య సంఘటన బీటలు వారింది.

సామ్రాజ్యవాద ఆధిపత్యానికి, సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వ్యతిరేకంగా 'జాతి' ఐక్యంగా వ్యవహరించడం అప్పటివరకూ ఉన్న ధోరణి. ఇప్పుడు దానికి బదులు దేశీయ, బహుళ దేశ బడా పెట్టుబడి కుమ్మక్కై దేశంలో తాము అనుసరించే "అభివృద్ధి" విధానాలను వ్యతిరేకించే అన్ని సామాజిక తరగతులనూ ప్రగతి నిరోధక శక్తులుగా పరిగణించే ధోరణి తలెత్తింది. జిడిపి వృద్ధి మంత్రమే సర్వస్వం అయ్యింది. ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలే ఇప్పుడు "దేశ ప్రయోజనాలు" అయిపోయాయి. వాటికోసం పని చేయడమే తక్కిన అన్ని వర్గాల బాధ్యతగా అయిపోయింది. ఆ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో రూపొందిన "జాతి" భావన బీటలు వారింది. ఇక ఇప్పుడు సామ్రాజ్యవాదం నుండి విముక్తి కోరుకోవడం అనేది ఎంతమాత్రమూ లక్ష్యంగా లేదు. నయా ఉదారవాద చట్రాన్ని పరిరక్షించడమే ఏకైక లక్ష్యం అయిపోయింది.

ముందు పేర్కొన్న రెండు బీటలలో ఇది మొదటిది. ఇప్పుడు నయా ఉదారవాద ప్రభుత్వం తీసుకునే వైఖరి దేశ సార్వభౌమాధికారాన్ని పటిష్టపరుస్తుందా లేక బలహీనపరుస్తుందా అన్నది ప్రామాణికంగా ఎంతమాత్రమూ లేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బడా కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేరుస్తుందా లేదా అన్నదే ప్రధానం అయిపోయింది. బడా కార్పొరేట్ల ప్రయోజనాలే 'దేశ ప్రయోజనాలు' అయిపోయాయి. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో ప్రభుత్వాలు అమెరికా-ఇరాన్ యుద్ధంలో అనుసరించవలసిన వైఖరిని నిర్ణయించేది ఆ దేశంలోని బడా కార్పొరేట్ల ప్రయోజనాలే తప్ప తమ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడం అనేది కానేకాదు.

## వడగాలులు, ఎండలతో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలన్నారు. కారు, బస్సు లోపల ఉన్నవారు వెంటనే అన్ని డోర్స్ మూసివేయాలి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉన్నప్పుడు మెడవెనుక జుట్టు నిక్క బొడవడం లేదా చర్మం జలదరింపు ఉంటె మెరుపు పిడుగు రావడానికి సూచనగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉండి సురక్షిత ప్రదేశాలకు వెళ్లే అవకాశం లేకుంటే రబ్బరు చెప్పులు ధరించి చెవులు మూసుకుని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలన్నారు. దీనివల్ల ఉరుములు మెరుపులు నుండి రక్షణ పొందవచ్చునని చెప్పారు. ఉరుముల సమయంలో ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకూ ఇంట్లోనే ఉండి రక్షణ పొందాలని సూచించారు. పిడుగు బాధితులను తాక వచ్చునని చెప్పారు. సత్వరమే వారికి సహాయం అందించవచ్చునని చెప్పారు. పిడుగు బాధితుని వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ఉరుములు మెరుపులు సంభవించినపుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదన్నారు. ఎలెక్ట్రికల్, ఎలట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, ఛార్జ్ డ్ ఫోన్స్, మొబైల్ ఫోన్స్ వినియోగించరాదన్నారు. పిడుగులా సమయంలో స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండడం లాంటివి చేయరాదన్నారు. మోటారు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. వాహనంలో ఉండి ఉంటే లోహపు భాగాలను తాకరాదన్నారు. ఎండ తీవ్రత నుండి కాపాడుకోవడానికి గాను వీలైనంత వరకూ ఇంట్లో ఉండాలి. తరుచూ నీటిని త్రాగుతూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని త్రాగాలి. తరుచూ వాతావరణం సమాచారం తేలుకుంటూ ఉండాలి అందులకు గాను న్యూస్ అనేది వాచ్ చేయాలి. ఎండలో నుండి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తీసుకోవాలి. ఎండలో బయటకు వచ్చినపుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుని సంప్రదించాలన్నారు. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. ఫ్యాన్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేయాలి. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. నలుపురంగు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. ఎండ సమయంలో శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ సమయంలో బయట సంచరించరాదు. వీరిపై ఎండ ప్రభావం కనపడే అవకాశం ఉంటుంది. శరీరాన్ని డీ
హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోరాదు. ప్రకాశించే బల్బులను వినియోగించడం మానుకోవాలి. అవి అనవసరపు వేడిని విడుదల చేస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తుఫాన్, వరదల సమయంలో టెలివిజన్ రేడియో ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే ప్రమాద స్థలం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి. తుఫాన్ వరదల సమయంలో ముందుగానే విలువైన వస్తువులు, పత్రాలు, నగదుతో సురక్షిత ప్రదేశంలో తలదాచుకోవాలి. సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వ సూచనలు అందుకున్న పిమ్మట మాత్రమే ఇళ్లకు తిరిగి వెళ్లాలన్నారు. తుఫాన్ లు వరదల తర్వాత అంటువ్యాదులు నిరోధించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ లు, వరదల సమయంలో కాల్వలకు వంతెనలకు అడ్డుపడిన చెత్తను తొలిగించాలి. సముద్ర నదీతీర ప్రాంతాలకు వెళ్ళరాదు. చేపల వేటను మానుకోవాలి. నదులు దాటే ప్రయత్నం చేయరాదు. పాడుపడిన ఇళ్ళు చెత్తా చెదారం నుండి దూరంగా ఉండాలి. విద్యుత్ పరికరాలను వినియోగించరాదు. వరద నీటి ద్వారా వచ్చే విష జ్వరాల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి. అంటువ్యాదులు వ్యాపించకుండా వరదనీరు కలుషిత నీరు నుండి దూరంగా ఉండాలి. ఇళ్లకు ఉన్న పగుళ్ళను పరిశీలించి తదుపరి లోపలకు వెళ్ళాలి. ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణములు ఆఫ్ చేయాలి. తడిచిన విద్యుత్ వస్తువులు తాకరాదు. ప్రకృతి విపత్తులు అయిన ఎండలు, వడగాలులు, తుఫాన్ లు, వరదలు, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు సమయంలో అత్యంత జాగరూకత వహించాలని ఆయా సమయాల్లో విపత్తుల నిర్వహణ సంస్థ వారు జారీ చేసిన రక్షణ చర్యలను పాటించాలని అప్పుడు ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు.

## మూడేళ్ల క్రితమే అభిప్రాయం చెప్పాం..

మొదటిపేజీ తరువాయి

పునర్విభజనలో అన్యాయం జరిగితే దక్షిణాదిలో బలమైన ప్రజా ఉద్యమం వస్తుందని నాడు కేటీఆర్ తెలిపారు. దేశంలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల ప్రతినిధులుగా ఉండడం గర్వకారణమన్నారు. దేశ అత్యున్నత ప్రజాస్వామ్య వేదికలో తమ ప్రజల గొంతుక, ప్రాతినిధ్యాన్ని అణచివేస్తే చూస్తూ మౌన ప్రేక్షకులుగా ఉండలేమని పేర్కొన్నారు. ఢిల్లీ పాలకులు తమ మాటలు వింటారని, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు నాడు కేటీఆర్ తెలిపారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో తెరపైకి కొత్త పేరు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో కొత్త పేరు తెరపైకి వచ్చింది. గతేడాది డ్రగ్స్ ఓవర్ డోస్‌తో కేదార్ అనే వ్యక్తి దుబాయ్‌లో మృతి చెందాడు. కేదార్‌తో రోహిత్‌రెడ్డి సోదరులకు సంబంధాలు ఉన్నట్లు కస్టడీ రిక్వెస్ట్ కాపీలో పోలీసులు వెల్లడించారు. కేదార్‌కు రోహిత్‌రెడ్డి మధ్య అనేక లావాదేవీలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతాల నుంచి కేదార్‌కు రూ.25 లక్షల లావాదేవీలు గుర్తించినట్లు తెలిపారు.

## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి



రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

మొదటిపేజీ తరువాయి

జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం
ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: తెదేపా కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది.

సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు.

29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు

జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77.

ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్ఛార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్.

రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం.

జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు

185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించిన తెదేపా

బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు

2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేపట్టిన చంద్రబాబు

## కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనులపై మంత్రి బీసీ జనార్దన్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా 'అదానీ కృష్ణపట్నం' పోర్టును పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోర్టు విస్తరణ పనులపై చర్చించారు. కంటెయినర్ టెర్మినల్ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాలపై మాట్లాడారు.

ఎగుమతి, దిగుమతి సామర్థ్యాలు పెంచే విధంగా పోర్టు విస్తరణ పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. పోర్టు కార్యకలాపాలు పెరగడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అంతకుముందు ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో 'అన్న క్యాంటీన్' ప్రారంభించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

## పంజాగుట్ట వద్ద కారులో చెలరేగిన మంటలు

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: బేగంపేటలో ప్రయాణిస్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. వరంగల్ నుంచి మణికొండ వైపు వెళ్తున్న కారు బేగంపేటలోని లైఫ్ స్టైల్ భవనం సమీపానికి చేరుకోగానే.. ఇంజిన్ నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు నిలిపివేశాడు. వెంటనే కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటుచేసుకోవడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను ఆర్పివేశారు. కారును క్రేన్ సహాయంతో తొలగించారు.

# దివ్యాంగుల హక్కుల కోసం 10 కీలక డిమాండ్స్ కమిషనర్ బి. శైలజ కి టి ఆర్ వి ఎస్ వినతి

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ( టి ఆర్ వి ఎస్) ఆధ్వర్యంలో దివ్యాంగుల సాధికారిత శాఖ కమిషనర్ బి. శైలజ ని కలిసి సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టి ఆర్ వి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షులు డా. షేక్ నయీమ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుతారి రమేష్, టి డి ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేకల అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలుగా మానిటరింగ్ కమిటీల పునర్వ్యవస్థీకరణ జరగకపోవడం గమనార్హమని తెలిపారు. ఇది చట్టపరంగా సరైన విధానం కాకపోవడంతో దివ్యాంగుల సమస్యల పర్యవేక్షణలో, సంక్షేమ కార్యక్రమాల అమలులో లోపాలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంక్షేమం మరియు సాధికారత కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ టి ఆర్ వీ ఎస్ క్రింది 10 ప్రధాన డిమాండ్స్‌ను



వినతిపత్రంలో ఉంచింది: 1. రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలి. 2. వికలాంగుల హక్కుల చట్టం-2016ను కఠినంగా అమలు చేయడానికి పోలీస్ శాఖతో సమన్వయం చేయాలి. 3. నిరుద్యోగ దివ్యాంగులకు తక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పించి, ప్రభుత్వ శాఖలలో బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలి. 4. రిజర్వేషన్ శాతాన్ని సమీక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. 5. మెడికల్ బోర్డు వ్యవస్థను పారదర్శకంగా మార్చి, సదరం సర్టిఫికెట్‌లో సవరణల కోసం ఆన్లైన్ సౌకర్యం కల్పించాలి. 6. సంక్షేమ శాఖలో అర్హత కలిగిన దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు ప్రాధాన్యంగా ఇవ్వాలి. 7. అన్ని జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖను స్వతంత్రంగా ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలి. 8. టి సి పి సి సెంటర్లను అభివృద్ధి చేసి, శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు కల్పించాలి. 9. స్వయం ఉపాధి పథకాలలో దివ్యాంగులకు 25% అదనపు సబ్సిడీ ఇవ్వాలి. 10. మూడు చక్రాల వాహనదారులకు పెట్రోల్ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించి, నెలకు కనీసం 30 లీటర్ల ఉచిత పెట్రోల్ అందించాలి. ఈ డిమాండ్స్‌పై కమిషనర్ బి. శైలజ సానుకూలంగా స్పందించి, సమస్యలను సంబంధిత మంత్రివర్గం మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించాలని, పై డిమాండ్స్‌ను అత్యవసరంగా అమలు చేయాలని టి ఆర్ వి ఎస్ నాయకులు కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# చందుర్తిలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక మండల సభ

- హాజరైన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు
- పలువురు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ

మేకార్తి దినపత్రిక,ఏప్రిల్ -16 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చందుర్తి మండల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మండల సభ గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. అరైవ్.. అలైవ్ కింద ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వా గార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ డ్రోన్, పలువురు లబ్ధిదారులకు మూడు నెలల సన్నబియ్యం పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కింద 525 మందికి మంజూరు చేయగా, 98 మంది లబ్దిదారుల ఇండ్లు పూర్తి అయ్యాయని, 427 ఇండ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ల పథకం ద్వారా 6,688 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని ఎంపీడీఓ రాధ వివరించారు. కొత్తగా 1,255 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందించామని తెలిపారు. 3,535 మంది రైతులు రైతు రుణమాఫీ పథకం ద్వారా లబ్ధి పొందారని, 10,867 మంది రైతులు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారని ఎంపీడీఓ పేర్కొన్నారు. 7,064 కుటుంబాలు గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ పొందుతున్నాయని, 10 మంది రైతులు సన్న బియ్యం వడ్లు పండించడం ద్వారా బోనస్ పొందారని వెల్లడించారు. 6,662 మంది చేయూత పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకము ద్వారా 401 స్వయం సహాయక సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా లబ్ధి పొందాయని, 831 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. 10,119 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు, 1,072 మందికి కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా లబ్ధి



పొందారని వెల్లడించారు స్టాళ్లను పరిశీలించి..వ్యవసాయ, ఉద్యానవన శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మహిళా సంఘాల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ భూపతి, ఎంపీఓ ప్రదీప్ కుమార్, వ్యవసాయ అధికారి దుర్గారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగాథ లో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 గంభిరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం శ్రీగాథ గ్రామానికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ శ్రేణులతో కలిపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు లబ్ధిదారులకు గురువారం రోజున ఇంటింటికి వెళ్లి అందజేశారు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులలో కల్వకుంట్ల నర్సింగరావుకు 60000 రాజవ్వకు 23,500 గౌరనేని చంద్రకళకు ?7, 000 జి రాజవ్వ కు 20వేల రూపాయలు మంజూరు అయినాయని పర్ష హన్మాండ్లు తెలిపారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర



నాయకులు ,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులకు ఎంతోకొంత మేలు చేకూరుస్తుంది అన్నారు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరు కి సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిలకు ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు ధన్యవాదాలు తెలిపారు,పది లక్షల రూపాయల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్ల లో ఆరోగ్యశ్రీ పథకము ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీన్ని అట్టడుగు ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని పర్ష హన్మాండ్లు ప్రజలకు పిలుపునిచ్చారు, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్ సౌకర్యము, రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ఈ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు, ఎంతో కాలం ఎదురుచూస్తున్న కొత్త పెన్షన్స్ కూడా ఈ ప్రభుత్వము లక్ష మందికి ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నదని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బందేల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వేముల శ్రీనివాస్ గౌడ్, తొండ్ల దేవేంద్ర నరసింహులు, సుద్దాల రాజమణి మల్లేశం, నాయకులు బందెల ప్రదీప్, పర్ష శ్రీనివాస్, తొండ్ల స్వామి, గౌరీనేని శ్రావణరావు , గొట్టెముకుల బాలయ్య,గౌరీనేని నరసింగరావు, కత్తుల బాబు, బందెల నరేష్, కల్వకుంట్ల నర్సింగరావు, కల్వకుంట్ల హనుమంతరావు, వేముల రమేష్ గౌడ్, వేముల ప్రశాంత్ గౌడ్, కల్వకుంట్ల హనుమంతరావు, కల్వకుంట వెంకటరావు, భీనవేని శ్రీకాంత్ యాదవ్, గొట్టిముక్కుల భూమలింగం, పర్ష నరసింహులు తదితరు పాల్గొన్నారు.

# కేంద్ర ఆరోగ్య పథకాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ రజిత గారి అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య అధికారులతో కేంద్ర ఆరోగ్య పథకాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ మాతృ మరణాలు,శిశు మరణాలు తగ్గించడంలో సకాలంలో గర్భిణీ స్త్రీల నమోదు, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను గుర్తించి చికిత్స మరియు అవగాహన అందించాల్సిందిగా, సకాలంలో వ్యాక్సినేషన్ ఇప్పించి సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగునట్లు ప్రోత్సహించాలని సూచిస్తూ, ప్రసవం తర్వాత చెకప్ లు చేయాల్సిందిగా మరియు0-5 సంవత్సరాల చిన్నపిల్లల వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందించి, పోషకాహారం పై అవగాహన కల్పించి మాతృ మరణాలు శిశు మరణాలు తగ్గించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించినారు. హెచ్. పి. వి (గర్భాశయ క్యాన్సర్ నివారణ) టీకా పై 15 సంవత్సరాలు నిండిన బాలికల అందరికీ ఇవ్వవలసిన ఆవశ్యకతను సూచిస్తూ, ఎన్ .సి .డి. కార్యక్రమంలో రక్తపోటు, మధుమేహ పరీక్షలు క్రమం తప్పకుండా చేయవలసిందిగా, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు రాబోయే రోజులలో ఎండ తీవ్రత అధికంగా ఉండడం చేత ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించవలసిందిగా ఉదయం 10 గంటల లోపే మరియు



సాయంత్రం 4 గంటల తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో పనులు చేసుకోవాల్సిందిగా, అధికంగా ద్రవ పదార్థాలు సేకరించవలసిందిగా వడదెబ్బ నివారణలో ఓరస్ పాకెట్లు ఆశల దగ్గర అందుబాటులో ఉంచాలని , కేంద్ర ఆరోగ్య పథకాలు సకాలంలో లక్ష్యాలు సాధించవలసిందిగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి. ఎం. హెచ్. ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ రామకృష్ణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న

- మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్
- తెలంగాణ రాష్ట్ర గీతంతో సభ ప్రారంభం

మేకార్తి దినపత్రిక, ఎల్లారెడ్డిపేట ప్రతినిధి



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో నేవూరి లక్ష్మీ మల్లారెడ్డి ఏసీ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన 99రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ. 500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులు లబ్ధి పొందారని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అందరు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలను చేపడుతున్నారని. ఏఎంసి చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అఫ్జల్ బేగం మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, అన్ని విభాగాల మహిళలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# సిరిసిల్లలోని కలెక్టరేట్ చౌరస్తాలో సీట్ బెల్ట్ పై అవగాహన

- జిల్లా రవాణా అధికారి :లక్ష్మణ్

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి




అర్రైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా గౌరవ కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తాలో సీట్ బెల్ట్ పై జిల్లా రవాణా శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి కార్యక్రమం లో జిల్లా పోలీస్ ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాలుగోన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి మరియు పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకొని వాహనాన్ని నడపాలని, లేనిచో ప్రమాదాలు జరిగినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావని, తద్వారా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు అదేవిధంగా డ్రైవర్ తో పాటు ఇతర సీటులో కూర్చున్న ప్రయాణికులు కూడా తూచా తప్పకుండా సీట్ బెల్ట్ ను ధరించాలని ఎట్టి పరిస్తుతుల్లో మద్యం తాగి వాహనమ్ నడపవద్దని తెలియజేశారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఉత్తమ పౌరులుగా ఉండాలని తెలియజేశారు. వాహనదారులు అందరితో రహదారి భద్రత ప్రతిజ్ఞను రవాణా శాఖ ఇన్స్పెక్టర్ చేయించారు. సీటు బెల్టు ధరించిన వాహనదారులకు ఔత్సాహికంగా వినూత్న పద్ధతిలో మిఠాయి లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృధ్వీరాజ్ వర్మా పోలీస్ మరియు ట్రాఫిక్ పోలీసు ,సిబ్బంది,వాహన దారులు సుమారు 300 మంది వాహనదారులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య అందుతుంది బడిబాటలో భాగంగా నేడు

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 16 గంభీరావుపేట్ రిపోర్టర్



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దమ్మన్నపేట ఉపాధ్యాయులు ఆ పరిధిలోగల ఎంపీపీ ఎస్ దమ్మన్నపేట ఎంపీపీ ఎస్ కుర్దులింగంపల్లి పాఠశాలలను సందర్శించడం జరిగిందని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బోయన్న గారి నారాయణ తెలియజేశారు ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వం అందించబోయే ( 21 వస్తువులతో కూడిన ) కిట్టు గురించి తెలియజేయడం జరిగిందని అదేవిధంగా ప్రభుత్వం అందించబోయే అల్పాహారం మరియు పాలు ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి తోడ్పడుతుంది కాబట్టి అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను విసించాలని ఈ సందర్భంగా వారిని కోరడం జరిగింది దానితో పాటు డ్రాయింగ్ బుక్కులు కలర్ పెన్సిల్ బాక్స్ అందచేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాడూరి సంపత్ కుమార్ మారేపల్లి రాజు గుడికాడి కొమురయ్య శనిగరం నారాయణ శ్రీనివాస్ రెడ్డి జడల విజయ శ్రీ శైలజ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను తీర్చిన కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



చేర్యాల పట్టణ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు లో గత కొన్ని రోజులుగా నీటి సమస్యతో బాధపడుతున్న వార్డు ప్రజలను దృష్టిలో పెట్టుకొని పాత మసీదు ( ఒంటి కొమ్ము మసీదు) ప్రాంతంలో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా ఆధ్వర్యంలో బోరు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముస్త్యాల అరుణ.వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా. కౌన్సిలర్లు కమలాపురం గీతాంజలి.కొమ్ము రాజేశ్వరి.నిమ్మ సుప్రజ రాజీవ్. వెలగల దుర్గయ్య.పొతిగంటి ప్రసాద్.భునాద్రి సురేష్.విరబత్తిని సదానందం.చేర్యాల మాజీ జడ్పిటిసి కొమ్ము నరసింహారావు. మాజీ కోఆప్షన్ నెంబర్ ఎండి ఖాజా. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్. మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య గౌడ్. శని గారి బిక్షపతి. తుమ్మలపల్లి సంతోష్.శనిగారి లక్ష్మణ్. బడే మియా. అంబటి అంజయ్య గౌడ్.చింటు.ఎండి నవాజ్. మరియు వార్డు ప్రజలు మున్సిపల్ సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల మండల స్థాయి సమావేశం.



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. ప్రకాష్ అధ్యక్షతన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం ము స్త్యాల రైతు వేదిక నందు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా,మండల స్పెషల్ ఆఫీసర్ డి. నాగరాజు ,మండల తహసిల్దార్ దిలీప్ నాయక్ , మండల పంచాయతీ అధికారి సుధీర్ కుమార్ , హౌసింగ్ ఏ ఈ మౌనిక , ఎంఈఓ నరేందర్ , ఏవో పులి భోగేశ్వర్ ,ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ దివ్య
, ఎలక్ట్రిసిటీ ఏ ఈ కనకయ్య , చేర్యాల ఎస్ ఐ అపూర్వ రెడ్డి , మెడికల్ ఆఫీసర్ ప్రశాంత్ , ఏపిఎం ఆంజనేయులు , మండల స్థాయి అధికారులు,వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు,పంచాయతీ కార్యదర్శులు మరియు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ మండల స్థాయి అధికారులు తమ నివేదికలను మండల సభలో ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు చదివి వినిపించడం జరిగింది. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి, అలాగే చేపట్టబోయే పథకాల గురించి ఈ సమావేశంలో తెలియజేయడం జరిగింది. అలాగే ప్రజల యొక్క సందేహాలను సమస్యలను కూడా స్వీకరించడం జరిగింది.

# అధిక ఉష్ణోగ్రతల నుండి జాగ్రత్తలు వహిస్తూ విధులు నిర్వర్తించాలి

- జిల్లా ఎస్పీ.



మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 16 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న అధికారులకు,సిబ్బందికి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వడగలుల నుండి రక్షణకు కూలింగ్ గ్లాసెస్ అందజేశారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...తీవ్ర ఎండల సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.ట్రాఫిక్ సిబ్బంది,బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ మరియు వివిధ బందోబస్తు విధులలో పాల్గొనే వారు నీరు, గ్లూకోజ్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఎండల ప్రభావం తగ్గించే విధంగా తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని,తగిన జాగ్రత్తలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగ వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమలపై, హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్ధాలపై,మైనర్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల సమావేశం

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16
గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలంలో రాష్ట్రప్రభుత్వంప్రతిష్టత్మాకంగాచేపట్టిన ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా మండల కేంద్రంలో గాయత్రి గార్డెన్ లో మండల స్థాయి సమావేశం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ప్రత్యేక అధికారి. ఎంపీడీవో రాజేందర్ తహసిల్దార్ మారుతి రెడ్డి. ఎస్సై అనిల్ కుమార్ ఏఎంసి చైర్మన్ విజయ పాల్గొని ప్రజా పాలనలో చేపట్టిన పథకాలు వివరిస్తూ మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు ఆయా శాఖల అధికారులు పాల్గొని సమావేశ ప్రారంభం దశలో తెలంగాణ జాతీయ గీతం మొదలుకొని మండలంలో ఇందిరమ్మ ఇండ్లు. గృహజ్యోతి 500 కే గ్యాస్ సిలిండర్. సన్న బియ్యం కళ్యాణ లక్ష్మి వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డులు వృద్ధాప వితంతు గీత కార్మిక వికలాంగుల చేనేత బీడి కార్మికుల ఒంటరి మహిళ పెన్షన్స్ తో పాటు రైతుబంధు రైతు బీమా పథకాన్ని అందిస్తూ లబ్ధిదారులు ఆర్థికంగా బలోపేతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకాల పురోగతిని ప్రభుత్వం చేపట్టబోతున్న పథకాలను వివరించారు. అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించి స్టాళ్లు ఏర్పాటు చేసి రైతులకు నానో యూరియా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ధర ఆయిల్ ఫామ్ పంటలు వేసుకొని ధర లబ్ది పొందవచ్చని సూచిస్తూ అలాగే అంగన్వాడి టీచర్లు పౌష్టిక ఆహారం స్టాల్లో రకరకాల పిండి పదార్థాలతో పాటు ఆరోగ్యకరమైన బలమైన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 28 నెలల్లో చేపట్టిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వారికి తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ వారికి వడ్డీ లేని రుణాలు స్వశక్తి సంఘాల ద్వారా అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వమని తెలిపారు. మండలంలో కొత్తపెల్లి గ్రామానికి రెండు బ్యాటరీ ట్రై సైకిల్ . మండలంలోని ఐదు అంగన్వాడి కేంద్రాలకు ఆక్వా గార్డ్ వాటర్ మినరల్ సెట్ లను మండల అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు అలాగే కొత్తపెల్లి సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నాగపురి బాలరాజు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్నయని ఇచ్చిన హామీలను మహిళలకు 2500 రూపాయలతో పాటు కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం అందించాలని కోరారు చివరి దశలో జై తెలంగాణ అని సర్పంచ్ సమావేశంలో అనగా కాంగ్రెస్ నేతలు జై కాంగ్రెస్ అంటూ సభలో నినాదాలు మారిమోగా టిఆర్ఎస్ కు సంబంధించిన ఉప సర్పంచ్ సమావేశం ముందటికి వచ్చి జై తెలంగాణ నినాదాలు చెయ్యగా టిఆర్ఎస్ కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా ఎస్సై అనిల్ కుమార్ నినాదాలు చేస్తున్న కార్యకర్తలను చెదరగొట్టి వారి స్థానాల్లో కూర్చొని బీఆర్ఎస్ నాయకుల్ని శాంతింపజేసి బయటికి పంపించగా సమస్య సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు. ఎంపీడీవో రాజేందర్ తహసిల్దార్ మారుతి రెడ్డి ఎస్సై అనిల్ కుమార్ గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సాగౌడ్ ఏఎంసీ చైర్మన్ విజయ. . బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మండ్లు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు నాగపురి బాలరాజ్ గౌడ్ అన్ని గ్రామాల సర్పంచులు ఆయా శాఖల అధికారులు అంగన్వాడి ఆశా వర్కర్ రెవెన్యూ సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘానికి త్వరలో ఎన్నికలు.

- సంఘం వ్యవస్థాపకులు కుందారం గణేష్ చారి..
- విశ్వకర్మ భవన్ లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్రస్థాయి సమావేశం..
- హాజరైన రాష్ట్రస్థాయి ప్రతినిధులు..

మేకార్తి, దినపత్రిక: హైదరాబాద్



విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘానికి త్వరలో ఎన్నికలు జరుగుతాయని సంఘం వ్యవస్థాపకులు కుందారం గణేష్ చారి తెలిపారు. సికింద్రాబాద్ లోని విశ్వకర్మ భవన్ లో వేదాస్ అసోసియేషన్, విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఐక్య సంఘం రాష్ట్ర ప్రతినిధులు వేదాస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం నిబంధనల ప్రకారం ఐదు సంవత్సరాల కాల పరిమితి పూర్తయినందున రాష్ట్ర కార్యవర్గ సభ్యుల కమిటీని ఎన్నికల ద్వారా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. ఐక్య సంఘం మాజీ అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి అప్రజస్వామికంగా ఎంపిక చేసుకున్న కార్యవర్గ సభ్యుల కమిటీ చెల్లదని తీర్మానం చేసుకున్నారు. త్వరలోనే ఐక్య సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రతినిధులతో చర్చించి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహించుకునేందుకు తేదీలను నిర్ణయం చేయాలని తీర్మానం చేయడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ ఒక లక్ష 15 వేల ఓట్లతో ఏర్పడిన ఐక్య సంఘం అన్ని సంఘాలని ఒకే తాటిపైకి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి ఎలక్షన్ కు వెళ్లాలని సూచించారు. సంఘంలో యువతకు కూడా అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుపుకొని అధ్యక్షున్ని ఎన్నుకునేందుకు వేదాస్ ముందుకు రావాలని సూచించారు. వేదాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగాజి సంతోష్ కుమార్ మాట్లాడుతూ జాతికి సేవ చేయడానికి నూతన నాయకత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలే జగన్నాథం మాట్లాడుతూ ఎర్రోజు బిక్షపతి ఐక్య సంఘాన్ని వసూళ్ల సంఘం గా మార్చి సంఘం పదవులను డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిని సంఘం నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి నాగచారి మాట్లాడుతూ ఐక్య సంఘానికి త్వరలోనే అందరి సహకారంతో వేదాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించుకొని నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. సాయిలు చారి, జైన్ కుమార్, ముతోజు మధు చారి, అనంతోజు బ్రహ్మచారి, వల్లబోజు నరసింహాచారి, తూముల నాగ చారి అక్కినపల్లి శ్రీనివాస్ చారి మాట్లాడుతూ వేదాస్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన సంఘం బైలా ప్రకారం ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికలకు వెళ్లాలని కోరారు. ఎవరైనా సరే పోటీ చేసి గెలిచి విశ్వకర్మ జాతికి ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రభుత్వ పథకాలను అందే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ ను జాతిపితగా ప్రభుత్వం ప్రకటించాలని ముక్తకంఠంతో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి పది జిల్లాల అధ్యక్షులు బ్రహ్మం, అశోక్ చారి, కమ్మరి మహేష్, శ్రీపాద నరేష్, బాలకృష్ణ, రాచపల్లి శ్రీధర్, మునిగంటి బ్రహ్మచారి, తాటికొండ శ్రీనివాస్, కృష్ణ చారి, బిక్షపతి, కృపాకర్ చారి, సాంబ చారి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ఎవరి చేతుల్లో?

మేకార్తి దినపత్రిక,ఏప్రిల్ 16

ఒక గిరిజన టీచర్ ప్రయివేట్ స్కూల్‌ను రీల్ ద్వారా ప్రమోట్ చేశాడని ప్రభుత్వం సస్పెన్షన్ చేసింది. నిబంధనల ప్రకారం అది తప్పే కావచ్చు. ప్రభుత్వ ఉద్యోగి ప్రయివేట్ సంస్థకు ప్రచారం చేయడం సరైంది కాదు. కానీ, అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. అదే నిబంధనలు అందరికీ సమానంగా అమలవుతున్నాయా? ఒకవైపు, బలహీన వర్గానికి చెందిన టీచర్‌పై వెంటనే చర్యలు తీసుకునే వ్యవస్థ... మరోవైపు, అదే విద్యను వ్యాపారంగా మార్చి కోట్ల రూపాయల సామ్రాజ్యాలు నిర్మిస్తున్న ఆధిపత్య కులాల ధనిక శక్తివంతుల ముందు మౌనం వహిస్తోంది. చట్టం అందరికీ ఒకటే అయితే, దాని అమలు కూడా ఒకటే ఉండాలి కదా. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను ::పిల్లలను ప్రయివేట్ స్కూల్స్‌కు పంపకండి:: అని పిలుపునిస్తారు. అదే సమయంలో, కొన్ని గంటలకే ఒక ఎమ్మెల్సీకి చెందిన ప్రయివేట్ స్కూల్ ప్రారంభోత్సవానికి వెళ్లి రిబ్బన్‌కట్ చేస్తారు. ఈ రెండు చర్యలు కలిపి చూసినప్పుడు ఇచ్చే సందేశం ఏమిటి? మాటల్లో ప్రభుత్వ విద్యకు మద్దతు... కానీ, చర్యల్లో ప్రయివేట్ విద్యకు ప్రోత్సాహం. ఈ వైఖరే సరికాదు. విద్య అనేది దళిత, బహుజన, గిరిజన వర్గాల అభివృద్ధికి మార్గం, వారి దాస్యశృంఖల విముక్తికి ప్రధాన మార్గం. ప్రభుత్వ పాఠశాలలే వారి పిల్లలకు ఏకైక ఆశ్రయం. అలాంటి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన పాలకులు, అదే సమయంలో ప్రయివేట్ విద్యావ్యవస్థను పెంపొందించడంలో భాగస్వాములు కావడం, ఇది రాజ్యాంగంపైన ప్రమాణం చేస్తున్న దానికి విరుద్ధం. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే టీచర్లు కేవలం ఉద్యోగులు కాదు, వారు ఆ సమా జానికి ఆశ, ఆదర్శం. అలాంటి వారిపై చిన్న కారణాలతో కఠినచర్యలు తీసుకోవడం, కానీ పెద్దస్థాయిలో జరుగుతున్న విద్యా వ్యాపారీకరణపై కళ్లుమూయడం, ఇది వ్యవస్థాగత వివక్షకు నిదర్శనం.చివరికి మనం అడగాల్సిన ప్రశ్న ఒకటే: రీల్ చేసిన టీచర్‌ను శిక్షించే ధైర్యం ఉన్న ప్రభుత్వం...విద్యను అంగడి సరుకుగా మార్చి, రాజ్యాంగం హామీ ఇచ్చిన ఉచిత విద్య హక్కును నీరుగారుస్తున్న ఈ రాజ్య శక్తివంతులను ప్రశ్నించగలదా?బహుజనవాడల్లో బడులు బలహీన పడుతుంటే, హైవేల పక్కన కార్పొరేట్ స్కూల్స్



పెరుగుతుంటే- ఈ వ్యవస్థ నిజంగా ఎవరిని కాపాడుతోంది? నిజంగా చెప్పాలంటే, నియమాలు బలహీనులపై కఠినంగా, శక్తివంతుల ముందు మౌనంగా ఉంటే... అది ప్రజా స్వామ్యం కాదు, అణచివేత. దౌర్జన్యం. విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై మౌనం వహిస్తూ, ఒక టీచర్‌పై ప్రతాపం చూపడం అన్యాయం. టీచర్‌పై చర్యలకు దిగితే మరి పాలకులు ప్రయివేటును ప్రోత్సహిస్తున్నారు కదా?వారిపై ఎవరు చర్యలు తీసుకోవాలి? ఇది ఆలోచించాల్సింది పౌర సమాజమే.

# గాంధీ నగర్ గ్రామంలా ఉచిత కంటి వైద్య శిబిరం




మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

గాంధీనగర్ గ్రామంలో ఆధ్య కంటి హాస్పటల్ చేర్యాల మరియు సిద్దిపేట కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి,డాక్టర్ బాలకిషన్ సహకారంతో గ్రామ సర్పంచ్ పోలు సంపత్, ఉప సర్పంచ్ పోషవేణి శ్రీశైలం మరియు పాలక వర్గం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది.ఇట్టి వైద్య శిభిరానికి 110మంది హాజరు కాగా వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు.23మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించిన డాక్టర్లు ఆపరేషన్ కొరకు 7మందిని హాస్పిటల్ కి తీసుకెళ్లారు ఆపరేషన్ చేసి ఇంటి వద్ద సురక్షితంగా చేర్చుతామని డాక్టర్ తెలిపారు. మిగతా వారికి దశల వారిగా ఆపరేషన్ పూర్తి చేయబడును.ఇట్టి కంటి వైద్య శిభిరానికి కృషి చేసిన టెక్నికల్ అసిస్టెంట్ జె.పర్శరాములు కి,సహకరించిన సర్పంచ్ కి,పాలక వర్గ సభ్యులకు మరియు గ్రామ పెద్దలకు,ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హృదయాన్ని కలచివేసే దారుణం: కొడుకు కోసం కన్న బిడ్డలనే బలితీసుకున్న తల్లిదండ్రులు!

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ ప్రతినిధి

ఏప్రిల్ 1న అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మొదట ఫుడ్ పాయిజనింగ్ అనుకున్న కేసు కాస్తా.. ఇప్పుడు పోలీసుల విచారణలో కళ్లు చెదిరే నిజాలను బయటపెట్టింది.

**అసలు ఏం జరిగిందంటే:**

విమల్ ప్రజాపతి, అతని భార్య భావన ఏప్రిల్ 1న దగ్గర్లోని డెయిరీ నుంచి దోశ పిండి తీసుకొచ్చారు. ఆ రోజు రాత్రి వారు, వాళ్ళ ఇద్దరు కూతుర్లు మిశ్రీ (4 ఏళ్లు), రాహా (3 నెలలు) ఆ దోశలు తిన్నారు. ఆ తర్వాత అందరూ తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. దురదృష్టవశాత్తూ ఆ పసిపిల్లలు ఇద్దరూ ప్రాణాలు విడిచారు, కానీ తల్లిదండ్రులు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు.

పోలీసుల విచారణలో మైండ్ బ్లాంక్ అయ్యే లాజిక్స్:

డెయిరీ ఓనర్ ప్రశ్న: రోజుకు వందలాది మంది నా దగ్గర పిండి కొంటారు, మరి ఈ ఒక్క కుటుంబానికే ఎందుకు ఇలా జరిగింది పోలీసుల అనుమానం: 3



నెలల పసికందుకు ఎవరైనా దోశలు తినిపిస్తారా ఆ వయసులో కేవలం తల్లిపాలు మాత్రమే ఇస్తారు కదా! ఈ కీలకమైన అనుమానాలతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అత్యంత దారుణమైన వాస్తవాలు వెలుగుచూశాయి.

**షాకింగ్ నిజాలు ఇవే:**

పోలీసుల సోదాల్లో భావన రాసుకున్న ఒక డైరీ దొరికింది. అందులో తనకు "కొడుకు పుట్టాలని తీవ్రమైన కోరిక ఉందని, ఆ కోరిక తీరితే ఒక గుడికి వెళ్లి మొక్కు తీర్చుకుంటానని" రాసి ఉంది. ఫోరెన్సిక్ రిపోర్ట్ ఏమందంటే బాధితుల రక్తంలో 'అల్యూమినియం ఫాస్ఫైడ్' (గోధుమలు నిల్వ ఉంచేందుకు వాడే సల్ఫాస్ ఇది అత్యంత విషపూరితమైన మందు) ఉన్నట్లు టాక్సికాలజీ రిపోర్ట్స్ నిర్ధారించాయి. విమల్ 10 ప్యాకెట్ల సల్ఫాస్ కొనగా, అందులో 8 మాత్రమే లెక్కకు తేలాయి. మిగిలిన 2 ప్యాకెట్లు ఏమయ్యాయి అన్నదానికి అతని వద్ద సరైన సమాధానం లేదు. కేవలం కొడుకు కావాలనే పిచ్చితో కన్న కూతుర్లకు ఆ విషాన్ని ఇచ్చి చంపి, తాము బతకడం కోసం కొద్దిగా విషాన్ని తీసుకుని ఫుడ్ పాయిజనింగ్ అనే నాటకం ఆడారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది....

# తెలంగాణ వచ్చి 12 ఏళ్లు.. కానీ వీడని కోర్టు కష్టాలు!

**- నేటికీ కోర్టుల చుట్టూ ఉద్యమకారుల ప్రదక్షిణలు.**
**- కేసులను ఎత్తివేయాలని డిమాండ్.**

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడుస్తున్నా, నాడు పోరాడిన ఉద్యమకారులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. సమైక్య రాష్ట్రంలో 'మా తెలంగాణ మాకు కావాలి' అని గళమెత్తినందుకు నమోదైన కేసులు నేటికీ వారిని వెంటాడుతూనే ఉన్నాయి. తమకు పథకాలు ముఖ్యం కాదు, ప్రత్యేక రాష్ట్రమే ముఖ్యమని నాడు మొక్కవోని దీక్షతో పోరాడిన ఉద్యమకారులు.. నేడు న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో




నిర్వహించిన 'రచ్చబండ' కార్యక్రమం సందర్భంగా తెలంగాణ నినాదాలు మిన్నంటాయి. ఆ సమయంలో తెలంగాణ కోసం నినదించినందుకు గాను సమైక్య పాలనలోని అధికారులు సుమారు పదిమందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. ఈ కేసులో, బూరుగు సురేష్ గౌడ్, కోనేటి స్వామి, మునిసిని బాబు గౌడ్ బూడిద కిష్టయ్య, వల్లూరి శ్రీనివాస్ రఘువీరారెడ్డి నవీన్ కుమార్ తదితరులు సుమారు 15 ఏళ్లుగా కోర్టు మెట్లు ఎక్కుతున్నారు."తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయినా, మాపై ఉన్న ఉద్యమ కేసులు ఎత్తివేయకపోవడం శోచనీయం"నాడు జైలుకు వెళ్లాం, నేడు కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. మా గోడును పట్టించుకునే వారు లేరా" అని వారు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నాటి ఉద్యమ కాలంలో నమోదైన ఈ అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఉద్యమకారులకు ఈ కోర్టు తిప్పల నుండి విముక్తి ప్రసాదించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్‌లు, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని, వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులను, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు. ఓరుగల్లు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి దాస్యం వినయ్ భాస్కర్

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను, టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన కాకతీయ క్రికెట్ అకాడమీ బృందాన్ని అభినందించారు. విజేతలకు చెక్‌లు, ట్రోఫీల ప్రదానం కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల్లో టోర్నీ విన్నర్‌గా నిలిచిన 51వ డివిజన్ జట్టుకు,




రన్నర్స్‌గా నిలిచిన 49వ డివిజన్ జట్టుకు కేటీఆర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. డిపార్ట్మెంట్ క్రికెట్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన అంజలి కిడ్నీ కేర్ సెంటర్ హాస్పిటల్ జట్టుకు, రన్నర్‌అప్‌గా నిలిచిన సంకీర్తన హాస్పిటల్ జట్టుకు కూడా ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ క్రికెట్ అకాడమీ (ఖజూా) ఫౌండర్ చైర్మన్ ఫారుక్ అలీ, కే సి ఏ సభ్యులు మాజీద్, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు, 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్ రావు, ప్రెసిడెంట్ ఫిరోజ్, 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మూటిక రాజు, యాదగిరి, పులి రజనీకాంత్, జోరిక రమేష్, నయీముద్దీన్, ఇమ్మిడి రాజు, దువ్వ కనకరాజు, ఇస్మాయిల్, కేశోజు ప్రణయ్, చిన్నా, రాంమూర్తి, రాకేష్ యాదవ్, వినీల్ రావు తదితర డివిజన్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రేపు లోక్ సభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక!

మేకార్తి దినపత్రిక,ఏప్రిల్ 16 హైదరాబాద్

ఈరోజు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమ య్యాయి. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, నారీశక్తి వందన్ చట్టసవ రణ, డీలిమిటేషన్ బిల్లు లను కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే బిల్లులపై ఇండియా కూటమి నేతలు తీవ్ర వ్యతిరేకతన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికలను బహిష్కరిం చాలని భారత కూటమి పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీ అయింది. అయితే తిరిగి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే



రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇక హరివంశ్ ఏప్రిల్ 10న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే తాజాగా జరుగుతున్న ప్రత్యేక సమావేశాల్లో భాగంగా ఏప్రిల్ 17న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక చేపట్టనున్నారు. అయితే డిప్యూటీ చైర్మన్ రేసులో మళ్లీ హరివంశ్ పేరే ప్రము ఖంగా వినిపిస్తోంది. తిరిగి ఆయన్నే ఎన్నుకుంటారా లేదంటే మరొకరికి ఛాన్స్ ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది.

ఇదిలా ఉంటే 2019 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. కానీ ఇటీవల ఖాళీ అయిన రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవిని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడుతుండడంతో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ నియామకాన్ని ప్రభుత్వం బలవంతంగా చేయించాలని చూస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది

# దళిత రత్న అవార్డు అందుకున్న జర్నలిస్ట్ ధనుష్ .

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 16 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

భారత రాజ్యాంగం నిర్మాణ కర్త, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ లోని అంబేద్కర్ కళ భవనంలో బాబు జగ్జీవన్ రావ్, బిఆర్ అంబేద్కర్ ఉత్సవాల కమిటీ, ప్రభుత్వ



సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కో చైర్మన్ సుదర్శన్ బాబు, మాజీ మంత్రి మొత్కుంపల్లి నర్సింహులు, దళిత జర్నలిస్టుల పోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్, చేతుల మీదిగా దళిత రత్న అవార్డును అందుకోవడం జరిగింది. సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటు, దళిత జర్నలిస్టుల పోరంలో దళిత జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ముందుకు వెళ్తున్న సందర్భంగా వారి సేవలను గుర్తించి దళిత రత్న అవార్డుకు ఎంపిక కావడం జరిగిందని ధనుష్ తెలిపారు. ఈ అవార్డు ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ అవార్డుకు కృషి చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కి, ఉత్సవాల కమిటీ సభ్యులకు, దళిత జర్నలిస్టుల పోరం కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణలో అతి త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

మేకార్తి దినపత్రిక,ఏప్రిల్ 16 హైదరాబాద్



రెండున్నర ఏండ్లగా పెండింగ్ పడుతూ వస్తున్న పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్, ఫెడరేషన్లకు చైర్ పర్సన్ల, నియమాలకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒకటి రెండు రోజుల్లో 17 చేతి వృత్తుల కుల సంఘాలకు చైర్పర్సన్లను నియమించ నున్నారు. దీంతో గంపెడు ఆశలతో ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు.. ఇప్పుడు తమ ప్రయత్నా లు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కీలక సమా వేశం నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర వ్యవహా రాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, భేటీ అయి.. నామినేటెడ్ పోస్టుల భర్తీ, అభ్యర్థుల ఎంపిక వంటి పలు విషయాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులను వీలైనంత తొందరగా భర్తీ చేసేందుకు.. ఈ కసరత్తు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి పచ్చ జెండా ఊపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం.. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన నాయకులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇక ఈ నామినేటెడ్ పద వులను కేటాయించడంలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

ఎవరికీ అన్యాయం జరగ కుండా.. అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని.. సమన్యాయం జరిగేలా ఆశావహుల జాబితాను తయారు చేసినట్లు సమాచారం.

# చింతలపల్లి గ్రామంలో వీధి కుక్కల దాడి: గర్భిణి సహా పలువురికి తీవ్ర గాయాలు

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ ప్రతినిధి

జన్నారం మండలం, చింతలపల్లి:తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో వీధి కుక్కల సమస్య రోజురోజుకూ పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లే సమయంలో భయాందోళనలకు



గురవుతున్నారు. వీధి కుక్కలు వాహనాల వెంటపడటం, అకస్మాత్తుగా దాడి చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జన్నారం మండలం చింతలపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గట్టు రాజన్న, గట్టు రాము, మేట్టుపల్లి గంగా, జమున, బుర్రగడ్డ అమ్మాయిలను తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటనలో మూడు సంవత్సరాల బాలుడు మరియు నిండు గర్భిణి మహిళకు తీవ్ర గాయాలు కావడంతో వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బాధితులను వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. జన్నారం మండలం పరిధిలోని అనేక గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు అవసరం గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు ముందుకు రావాలి

# చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామం గా ఎన్నికైన ధన్నూర్ గ్రామం

మేకార్తి దినపత్రిక ఆదిలాబాద్ జిల్లా ఏప్రిల్.16



బోథ్ మండలంలో నాలుగు గ్రామాలు ఎన్నికవ్వడం జరిగింది .ఇందులో భాగంగా ప్రశంషా పత్రాన్ని ఎంపీడీఓ ఎమ్మార్వో కలిసి ధన్నూర్ గ్రామ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి ఉపసర్పంచ్ కారం సుజాత పంచాయతీ కార్యదర్శి శిరీష అంగన్వాడీ టీచర్స్ రమక్క లలిత ఐ.సి.పి.ఎస్. మమతా ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ మౌనిక లలిత కు అందించడం జరిగింది.

# సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు..

మేకార్తి దినపత్రిక
మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో 'సంఘటన్ సృజన్ అభియాన్ ' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కోసం ఏఐసీసీ 'సంఘటన్ సృజన్ అభియాన్ ' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది..మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపికకై ఏఐసీసీ పరిశీలకులు (అబ్జర్వర్ ఎ.ఐ.సి.సి.)గా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియమితులయ్యారు.డీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక ప్రక్రియలో భాగంగా బుధవారం సాంగ్లీ జిల్లాకు చేరుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు స్థానిక జిల్లా నాయకులు, కార్యకర్తలు పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశిస్తూ ఎమ్మెల్యే ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభమయిందని. పార్టీ బలోపేతం కోసం పాటుపడే వ్యక్తిని అధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల అభ్యర్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పూర్తి పారదర్శకంగా,నాయకుల, కార్యకర్తల యొక్క అభిప్రాయాలను మరియు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని సహకరించాలని కోరారు.స్థానిక నాయకుల, కార్యకర్తల యొక్క అభిప్రాయాలను అధిష్టానానికి పంపి డీసీసీ పదవికి సిఫారసు చేయడం జరుగుతుందని అన్నారు.పార్టీ అధిష్టానం డీసీసీ అధ్యక్షుడి నియామకంపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు.పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ నాయకత్వాన్ని కార్యకర్తల ద్వారానే ఎంపిక చేయడం, పార్టీ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఒక మంచి ప్రక్రియ అని అన్నారు.ఈ విధానం ద్వారా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వాన్ని కార్యకర్తల అభిప్రాయాల ఆధారంగా



ఎంపిక చేయడం వల్ల పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలపడటానికి దోహదం చేస్తుంది అని అభిప్రాయం వ్యక్తం చేశారు.అనంతరం అభ్యర్థులకు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీ ప్రణితి షిండే ఎంపీ విశాల్ పాటిల్ మాజీ మంత్రి మరియు ఎమ్మెల్యే విశ్వజిత్ కదమ్ పూణే మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దీప్తి చవాన్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన మానవత్వం..

మేకార్తి దినపత్రిక
కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న సితలె రమేష్. వారం క్రితం ఎండి ఆసిఫ్ అనే యువకుడికి బీర్కూర్, తిమ్మాపూర్ మధ్యలో యాక్సిడెంట్ అయి



నిజామాబాద్ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు,వారి పరిస్థితి బాగాలేదు అని అబ్దుల్ నయీం అనే వ్యక్తి రమేష్ అన్నకి చెప్పగానే రమేష్ అన్న తన వాట్సాప్ స్టేటస్ ద్వారా 14,500 రూపాయలు జమచేసి ఈరోజు ఆసిఫ్ ఇంటికి వెళ్లి ఇచ్చి వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం జరిగింది.ఇట్టి సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు సితలే రమేష్, గ్రామ యువకులు అబ్దుల్ నయీం,భరత్, శ్యామ్ శ్రీకాంత్, నిఖిల్,ప్రవీణ్,ఆసిఫ్, పాల్గొన్నారు,

# బీసీ వసతి గృహంలో బాలిక మృతి...

మేకార్తి దినపత్రిక



ఎల్లారెడ్డిలోని బీసీ బాలికల వసతి గృహంలో విషాదం చోటుచేసుకుంది. 8వ తరగతి చదువుతున్న శ్రావణి (13) సంవత్సరాల బాలిక హఠాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు సమాచారం.వసతి గృహ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, బాలికకు అకస్మాత్తుగా అస్వస్థత కలగడంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఆసుపత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందినట్లు వార్డెన్ పేర్కొన్నారు. మృతురాలు నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందినదిగా తెలిపారు.బాలిక మృతికి గల కారణాలపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అధికారుల దర్యాప్తు అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది అన్నారు.

# యూఎస్ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష..

మేకార్తి దినపత్రిక
కామారెడ్డి జిల్లా కేంద్రంలో యూఎస్ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు.నాయకులు మాట్లాడుతూ యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల దేశీయ రైతులు, వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం వల్ల విదేశీ కంపెనీలకు అధిక ప్రాధాన్యం లభించి, స్థానిక ఉత్పత్తులు మరియు




రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.అలాగే, ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని, యూఎస్ ట్రేడ్ డీల్‌ను వెంటనే పునర్విమర్శించాలని డిమాండ్ చేశారు.ఈ సత్యాగ్రహ దీక్షలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కార్యదర్శి రోషిణి జైస్వాల్ కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఉమారాణి విచ్చేసి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీనివాస్,సర్దార్,ఇమ్రోజ్ ఎన్.ఎస్.యు.ఐ.అధ్యక్షుడు సందీప్ జిల్లా కార్యదర్శులు అజ్మత్,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

# గర్గుల్ విద్యార్థిని కలిగోట వీణ ను అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్..



మేకార్తి దినపత్రిక
కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కలిగోట వీణ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ గర్వకారణంగా నిలిచింది.ఇటీవల రాంచీ, రాజగిర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్‌లలో ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికైంది.ఈ ఇండియన్ టీం క్యాంప్ ఏప్రిల్ 19 నుండి భోపాల్‌లోని ఎస్.ఏ.ఐ. సెంటర్‌లో నిర్వహించబడనుంది. ఇక్కడి నుంచే జపాన్‌లో జరగనున్న సబ్ జూనియర్ (యు-18) ఆసియా కప్‌కు భారత జట్టు కు ప్రాతినిధ్యం వహించనుంది.అండర్ 18 ఇండియన్ టీం కి సెలెక్ట్ అయిన కలిగొట వీణ ను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తన చాంబర్ లో అభినందించి, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా 150 కుటుంబాలకు అంబేద్కర్ చిత్రపటాల పంపిణీ

**- కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు.... అంబేద్కర్.... ఏనుపోతుల తిరుపతి**

మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఏనుపోతుల తిరుపతి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం గ్రామంలోని 150 కుటుంబాలకు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అంబేద్కర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అదేవిధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో అలంకరించి ట్రాక్టర్ లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అట్టడుగు వర్గాల వికాసానికి, దేశ నిర్మాణానికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని యువత పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత ఆశించిన సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాచారం గ్రామ అంబేద్కర్



యువజన సంఘం నాయకులు, సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, యువకులు తదితరులు పాల్గొన్నారు.


# దేశవ్యాప్తంగా దంచి కొడుతున్న ఎండలు ఉచిత మజ్జిగ పంపిణీ చేసిన బెశీద్రం తిరుపతిరెడ్డి



మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 16 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణి చేస్తున్న బెంద్రం.తిరుపతి రెడ్డి ఇల్లంతకుంట మండలనికి వచ్చే వేలాది మంది ప్రజలకు ఎండ తీవ్రత నుండీ ఉపశమనం కలిగించేందుకు ఉచిత మజ్జిగ బి టి ఆర్ బెంద్రం. తిరుపతిరెడ్డి ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న బెంద్రం.తిరుపతి రెడ్డి మండల యువజన సంఘాల అధ్యక్షులు, నాయకులు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు బొల్లారం.ప్రసన్న కుమార్ బొల్లం.రాంసాగర్ కమల్ల.ఎల్లేష్ మ్యకల.మల్లేశం దూది.వెంకట్ రెడ్డి చిత్యాల.శ్రీనివాస్ తదితరులు పాలుగోన్నారు.

# బాన్సువాడ పోస్ట్ ఆఫీస్ లో అర్ధరాత్రి దొంగల కలకలం..

మేకార్తి దినపత్రిక
బాన్సువాడ పట్టణంలో యథేచ్ఛగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.
వరుస ఘటనలతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న పోస్టాఫీస్‌ను లక్ష్యంగా చేసుకుని దొంగలు రాత్రి సమయంలో దాడికి దిగడం సంచలనంగా మారింది.బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పోస్టాఫీస్‌లో సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఆ




సమయంలో విధుల్లో ఉన్న వాచ్మెన్ సాయిలు దొంగలను అడ్డుకునే ప్రయత్నం చేయగా, వారు కర్రలతో అతనిపై దాడి చేశారు. ఈ దాడిలో సాయిలు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. అనంతరం దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అలజడిని గమనించిన స్థానికులు వెంటనే పోస్టాఫీస్కు చేరుకున్న అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడిన సాయిలును వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతనికి ప్రాథమిక చికిత్స అందించారు.
3

# చిరుతపులి తో పోరాడి తరిమి కొట్టిన గొర్రెల కాపరి

**- బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఫారెస్ట్ అధికారులు**

మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలం చిన్నంపల్లి లో నిన్న రాత్రి గొర్ల కాపరి వీరయ్య పై చిరుత పులి దాడి చేయగా అతను ఒక్కడే చిరుతపులితో పోరాడి తరిమికొట్టాడని స్థానికులు తెలిపారు. చిరుతపులితో పోరాడే సమయంలో అతడి తలకి మరియు శరీరానికి బలమైన గాయాలు అయ్యాయని తెలిపారు. వీరయ్య సొంత గ్రామం పానకల్ మండలం జమ్మాపురం అని ఆయన గొర్రెలను మేపుకుంటూ చిన్నంపల్లికి రాగా ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. సమాచారం అందుకున్నటువంటి అటవీశాఖ అధికారులు వచ్చి గొర్ల కాపరి వీరయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. చిరుత పులి సంచారంతో గ్రామస్తులు, చుట్టుపక్కన పొలాల వారు భయాందోళనకు గురయ్యారు. అవసరం ఉంటేనే తప్ప రాత్రి సమయంలో బయటకి రాకూడదని అటవీశాఖ అధికారులు సూచించారు.



PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com